# ప్రజాస్వామ్యం

**ఆచార్య రంగా**

కూర్పు:

యన్. విజయరాజకుమార్

విజయ పబ్లికేషన్స్ - తెనాలి 1.

స్వతంత్రోద్యోగియుల గ్రంథమాల—8

ప్రతులు 2000

వెల 50 న. పై.

# ముందుమాట

రాజకీయ పరిభాషలో అనన్య ప్రచారంలో ఉన్న పదం 'ప్రజాస్వామ్యం' ప్రతిరాజకీయ పార్టీ తన విధానం ప్రజా స్వామ్య పూరితమైనదిగానే ప్రకటించుకుంటుంది అయితే ప్రజాస్వామ్యం లోతుపాతులు గ్రహించటం అంత తేలికైన పనిగాదు. మూడువేల సంవత్సరాలుగా రూపొందుతూ పెరుగుతూవున్న ఈ ప్రజాస్వామ్య విధానం గురించి సమ గ్రంగా వివరించగలిగిన తెలుగు రచన యింతవరకు లేదని చెప్పటం అతిశయోక్తి కానేరదు. ఇంతవరకు రాజకీయపార్టీ లేవీకూడ దీనిని గురించి విపులంగా తెలిపే గ్రంధాన్ని ప్రచు రించలేదు.

ప్రజాస్వామ్య మంటే తెలియని ప్రజాస్వామ్య రాజ్యంలో పౌరులంగా వుండటం సమర్ధనీయంకాదు. ఆంగ్ల భాషలో ప్రజాస్వామ్యం గురించి సుబోధకం చేయగల అమూల్య గ్రంధాలు అసంఖ్యాకంగా వున్నవి. భావ ప్రకట నలో పరస్పరం భేదించే రచనలు కొన్ని సాగినా ప్రజా స్వామ్యం మూల సూత్రాలలో దాదాపు అందరూ ఏకీభ విస్తూనే వున్నారు. ఎంత కాలంనుంచో సర్వాంగ సుందర మైన ప్రజాస్వామ్య వివరణకు సంబంధించిన గ్రంధాన్ని వ్రాయాలని కుతూహలు పడుతున్నప్పటికీ సాధ్యంకాలేదు.

1958 లో నిడుబ్రోలులో స్వల్పవ్యవధి రాజకీయ పాఠ శాల నడిచింది. అందులో ఆచార్య రంగాగారు వివిధ రాజ

కీయ విధానాలను గురించి ఉపన్యసిస్తూ ప్రజాస్వామ్యంమీద అమూల్యభావాలను వ్యక్తపరిచారు. ఆ భావాల ఆధారంతో వెంటనే రచన సాగించాలని కోరిక కలిగింది. ఇందులో ప్రకటించిన భావాలు రంగాగారివి. భాష-కూర్పు నాది. సందర్భాన్నిబట్టి కొందరు పెద్దలభావాలను వారివారి గ్రంథాల నుంచి తీసి చేర్చటం జరిగింది. ఇందులోరాని అంశాలన్నీ రెండవభాగంలో పొందుపర్చబడినవి. ఈ రచనను ప్రోత్సహించిన శ్రీ రాజగోపాలనాయుడుగారికి నా ధన్యవాదాలు.

కృషిక్‌నగర్
తెనాలి-1
1-11-1960

భవదీయుడు

**విజయ రాజకుమార్.**

# ప్రజాస్వామ్యం

చరిత్ర కందినంతవరకు ప్రజాస్వామ్యానికి వేలసంవత్సరాల భోగట్టా వుండటం మనఅదృష్టం అని చెప్పాలి. గ్రీక్, చైనా, భారత దేశాలలో వేలసంవత్సరాలనుంచీ ప్రజాస్వామ్యంపై పరిశోధనలు సాగుతూనే వున్నయ్. అయినప్పటికి ప్రజాస్వామ్య స్వరూపం అసంపూర్తిగానే వుండిపోయింది. కాని ఏ ఇతర సంపూర్ణ విధానంకంటెగూడ ఈ అసంపూర్ణ ప్రజాస్వామ్యంలోనే హెచ్చు ఆనందం కలిగినట్లు కలుగుతున్నట్లు, పజలు భావించుకుంటున్నారు. పరిశోధన ఇంకా పూర్తి కాలేదు. ప్రజాస్వామ్యంఅనేది అసలు మానవత్వమనుగడలో ఒక శాశ్వితమయిన విధానం. ప్రపంచపుట్టుకలో సముద్రం ఎలాంటి సహజస్థానాన్ని కలిగి ఉన్నదో అలాగే మానవమనుగడలో యీ ప్రజాస్వామ్యం ఒక సహజ ఉనికిని భద్రపరుచుకొనివున్నది. సముద్రంలో బడబానలం అనేది పుట్టినప్పుడు నీరు కళపెళకాగి ఏ విధంగానైతే లక్షలాది జీవరాసులు చనిపోతాయో అదే విధంగా ప్రజాస్వామ్యంలో ముసలం పుట్టినప్పుడు లక్షలకొలది ప్రజలు అదృశ్యమవుతుంటారు. అందుకనే అనేక సందర్భాలలో ఆటు, పోట్లను ఇది ఎదుర్కోవలసివచ్చింది.

ప్రజాస్వామ్యం ఊహాజనితమైందిగాదు. అది ఆచరణ యోగ్యం, అనుభవయోగ్యం అయినటువంటిది. దాని సృష్టికర్తలు ప్రజలే. అందువలన ఒక్కొక్కప్పుడు ఊహాజనితానికి పట్టినగతి ప్రజాస్వామ్యానికిపట్టదు. మిగిలిన అన్నివిధానాలు ఒకఎత్తు, ప్రజాస్వామ్యం ఒకటే ఒకఎత్తు అని చెప్పుకున్నా దానిని మనమింకా నిండుగా గౌరవించినట్లు గాదు, విశాలమైన సముద్రం తనలో ఎలా సమస్తాన్ని ఇముడ్చుకోగలుగుతుందో అదేమాదిరిగా ప్రజాస్వామంగూడ ప్రజలకు సంబంధించిన ప్రతివిధానాన్ని తనలో ఇముడ్చుకోగల్గుతుంది. మనమింకా చెప్పుకోవలసిన అనేక విధానాలకు వున్న లోపం దీనికి వున్నట్లు కనుపించదు. అవి ప్రశ్నిస్తాయిగాని ప్రశ్నించబడవు. ప్రశ్నను సహించవు గాబట్టి ప్రజలనుండి ప్రశ్నగూడ పుట్టదు. ఇది ప్రశ్నల సహిస్తుంది గాబట్టి సమస్త మానవళి భావాలను జీర్ణించుకోగలదు.

ఇటీవల ప్రజాస్వామ్యాన్ని గురించి అనేకమంది తమకు తోచిన రీతిగా మాట్లాడుకుంటున్నారు. అనేకమంది అర్థంగాక తికమకపడుతున్నటువంటి వారుగూడ వున్నారు. ఎందుకిలా జరుగుతుందంటే కొన్ని విధానాలకున్నటువంటి పరిధులు దీనికిలేవు. అందువలన పరిమితమైన సాహిత్యం గూడలేదు. ప్రజాస్వామ్యాన్ని గురించి ఇదమిద్ధంగా "ఇది" అనిగాని లేక అది ఏంచేస్తుంది అనిగాని ఖచ్చితంగా చెప్పటం అంత సులభంగాదు. ఎందువలన? అది బహుళ ప్రజలకు సంబంధించినది గాబట్టి, వారి మనసులలో పుట్టే వ్యూహ

లన్నింటిని, ఆలోచన లన్నింటినీ ఏ ఒక వ్యక్తి స్థిరీకరించవ లేదు గాబట్టి, ఎవరు ఏమిచెప్పినా దానికి భాష్యకారులేగాని, సూత్రకారులు కారు. భాష్యాలలో ఒకమాటకు వున్న అర్థమే తికమకలు పెడుతూవుంటే ఒక్కపదంలో ప్రజాస్వామ్యంఅంటే ఏమిటో చెప్పటంగూడ దుర్లభమవుతుంది.

ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ప్రేమించేవారు.ప్రశ్నించేవారు ఉభయులూ వున్నారు. దానిని అనుసరించేవారు, దానిని చూచి ఆశ్చర్యపడేవారూ వున్నారు. అందువలన వారికి నచ్చచెప్పటానికి పురాతనకాలంనుంచీ ఇప్పటివరకు దానిని ప్రేమించిన అనేకమంది మేధావులు ఎంతో ప్రయత్నం చేశారు. అలాంటి ప్రయత్నాలను నిమిత్తమాత్రంగానైనా మనం గ్రహించినా మనకు దాని సమాధానం లభిస్తుందని నా నమ్మకం. వివరాలు తరువాత చెప్పుకుందాం.

తప్పులు చేయటం మానవునికి అసహజంకాదు. కనుక అనేక శతాబ్దాల తరబడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని తప్పులు సవరించుకుంటూ రూపొందించారు. కొన్ని పొరపాట్లు, తప్పులు జరిగినా, ప్రజాస్వామ్యంలో చెప్పుకోదగినటువంటి అభివృద్ధిని వారు సాధించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని అర్థంచేసుకోవాలంటే, అది ఎక్కడవుందో తెలుసుకోవాలి. అంటే, ఉన్నపళంగానే శల్యపరీక్ష చేయవలసివుంటుంది. ప్రజాస్వామ్యాన్ని ఎవరు సృష్టించారో అది వారిమధ్యనేవుంది. చీకట్లో ఛాయ కనుపించదు. వెలుతురు

వున్నప్పుడే రూప-ప్రతిరూపాలు కనుపిస్తవి. అందువలన సంఘానికి ఛాయగా ప్రజాస్వామ్యం అంటిపెట్టుకొని వున్న దనేది పరిశీలిస్తే స్పష్టంగా అర్థంకాగలదు. ఏ దేశంలోనైనా ప్రజలపైనందిననడకే ప్రజాస్వామ్యాన్ని విప్పార్చి చూపెడు తుంది ఇక మనం సమాజంలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిద్దాం.

సమాజానికి జీవగఱ్ఱ వ్యక్తి అని ఇంతకుముందే చెప్తూ వున్నాం. అందువలన వ్యక్తిత్వంతో బ్రతికే వ్యక్తి వున్నంత కాలం, ఆ వ్యక్తి సమాజంలో భాగస్వామిఅయి వున్నంత కాలం, సమాజ ప్రతిబింబమయిన ప్రజాస్వామ్యం బ్రతికే వుంటుంది. పెరిగే వ్యక్తి, పెరిగే సమాజానికి వికాసంలో భాగస్వామి అవుతున్నాడు గాబట్టి ప్రజాస్వామ్య అభివృద్ధికి గూడ అతడు భాగస్వామి అవుతున్నాడు., పుట్టుక రీత్యా వ్యక్తులందరు సమాజంలో సభ్యులే. ఒకరు ముందుపుట్టినా ఒకరు వెనుక పుట్టినా, ఒకరు పుట్టనున్నా. వారు స్త్రీల యినా, పురుషులయినా, సమాజంలో వారు సహజమైన సభ్యులవుతున్నారు.

ప్రపంచంలో వేలకొలదిగా భాషలున్నా వాటిని మాట్లాడే తెగలున్నా వారు నివసించే దేశాలు భిన్నమైనా. వారుచేసే పనులలో తారతమ్యాలువున్నా, వారి సంస్కృతి నాగరికతలు, పరస్పర వైవిధ్య పూరితాలైనా, ఆకృతినిబట్టి మానవులుగా, విశ్వమానవ కల్యాణానికి అందరూ సమాన

భాగస్తులే. అయితే సమాజంలో తెల్లటివాళ్లు, నల్లటివాళ్లు, ఎర్రటివాళ్లు, పసుపు పచ్చటివాళ్ళు, వీటన్నిటి మిశ్రమ రంగులవాళ్ళు వున్నారు. పొట్టివాళ్ళు, పొడుగువాళ్ళు వున్నారు. తెలివి గలిగినవాళ్ళు, తెలివి తక్కువవాళ్ళు వున్నారు. బలవంతులు, బలహీనులు వున్నారు. దయ గలిగినవారు, దుర్మార్గులువున్నారు. నమ్మకస్తులు, బాధ్యతా రహితమైనవాళ్ళు వున్నారు. పెద్దమనుష్యులు, దొంగలు వున్నారు. లౌకికులు, అలౌకికులు వున్నారు. తాత్వికులు, మాధ్యులు వున్నారు. ఆధ్యాత్మిక వాదులు, భౌతికవాదులు వున్నారు. సన్యాసులు, సంసారులు వున్నారు. ఇలాగేఎన్నో తరహాల మనుష్యు లున్నారు. ఎవరికున్న యోగ్యతా యోగ్యతలు వారి కున్నవి. వీ రందరిని తనలో ఇముడ్చు కొని, అందరిని ఉత్తీతములుగా మార్చ ప్రయత్నించేదే ప్రజాస్వామ్యం.

సమాజం కొన్ని వర్గాలుగా విభజింపబడివుంది. వారు వారు చేస్తున్న పనులు భిన్నంగా వుంటున్నవి. వారిఆదాయ వ్యయాలు భిన్నంగా వుంటున్నవి. వారి బ్రతుకు పరస్పర ఆధారభూతమైంది. వీ రందరిని తనలో ఇముడ్చుకొని ప్రేమై కంగా నడుపుకుంటుంది ప్రజాస్వామికం.

కొన్ని ఆలోచనలు ప్రమాదభరితంగాను మరికొన్ని ఆలోచనలు సహాయకారికంగాను వుంటవి. అందువల్ల కష్టా లనుభవించిగాని లేక నెమ్మదిగా గాని సంఘం ముందుకు

పోతుందో లేదో ప్రజలు అర్థంచేసుకుంటూ వుంటారు. వ్యక్తి అయినా, లేక సంఘమయినా ఒక్కొక్కప్పుడు సిద్ధాంత దృష్టిని కోల్పోవలసివుంటుంది. అటువంటప్పుడు చట్టం ద్వారా బలపర్చబడిన ప్రాథమిక ఆశయాలను సంఘంలోని ప్రతిసభ్యుడు తనభద్రతకు, తన సౌఖ్యానికి వాటి అవసరమెంతో పునశ్చరణ చేసుకొని విశ్వాసాన్ని తిరిగి పుంజుకుంటాడు. ప్రజాస్వామిక ఆశయాలను, లక్ష్యాలను ప్రజలు ఎందుకు కాంక్షిస్తున్నారో మనం కొంత ఆలోచన చేయవలసివుంది.

ఆధునిక ప్రపంచంలో అనేక శాస్త్రాలపట్ల భావాలు విజృంభించి నడుస్తూవున్నవి. మానవుని విజ్ఞానం వికసించిందే కానిఅది ఏఒక్కరంగంలోను పరిపూర్ణతను సాధించి అంతిమ స్థాయికి చేరుకుని ఆగిపోలేదు. అందువలన కొన్ని విధానాలలో హద్దుల నేర్పరచుకొన్నట్లుగా ప్రజాస్వామ్యం మారటానికి వీలులేని హద్దుల నేర్పరచుకోలేదు. ప్రాథమికహక్కులను నగ్నసత్యాలను అది గౌరవిస్తుంది. ఒక్కొక్కప్పుడు శాస్త్రానికి అందని కొన్ని ప్రజావిశ్వాసాలను వాటి కాధారమైన మతాలను ప్రజాస్వామ్యం సహనతతో తనలో ఇముడ్చుకుంటుంది.

1. ఒక అసలైన ప్రజాస్వామిక దేశంలో పురాతన కుటుంబ కట్టుబాట్లు అతిక్రమించబడవు.

2. వ్యక్తి కావాలనుకుంటే తన ఇరుగుపొరుగువారిని మిత్రులుగా చేసుకోవచ్చు.

3. మైత్రిని, సామరస్యాన్ని ఇతర దేశాలలోని ప్రజలపట్లగూడ చూపెట్టుకొనే దానికి అవకాశంగలదు.

4. తన స్వంత ధోరణిలో నిరాకారమైన విశ్వశక్తిని రూపారూపాలలో వ్యక్తి ఆరాధించుకోవచ్చు.

5. తన ఇరుగుపొరుగువారితో, తన ప్రభుత్వంతో భేదించినప్పుడు విమర్శించేహక్కు ప్రజాస్వామ్యంలో వ్యక్తి కుంటుంది.

6. పూర్వవిజ్ఞానాన్ని, ఆధునిక విజ్ఞానాన్ని పరిస్థితుల తీత్యా, సౌలభ్యానుగుణంగా వ్యక్తి అనుకరించి ముందుకు తీసుకొనిపోవచ్చు.

7. తనకు కావలసిన ప్రభుత్వ నిర్వాహకులను ఎన్ను కొనే దానికి అతడు స్వేచ్ఛగా ఓటు చేయవచ్చు.

8. తన దేశ ప్రతిష్ఠను పెంపొందించే కార్యక్రమాలకు అతడు మద్దతు ఇవ్వవచ్చు.

9. సమస్త మానవుల జీవన ప్రమాణాల పెంపుదలకు అతడు మద్దతు ఇవ్వవచ్చును

10. వ్యక్తి దురాక్రమణను ప్రతిఘటిస్తాడు.

11. ఆంతరంగికంగా లేక బాహాటంగా వొచ్చే దరాక్రమణను ప్రతిఘటించవచ్చునని నమ్ముతాడు.

12. అతడు ఆనందపడేదానికి, అనుభూతి పొందే దానికి తగిన సమయాన్ని కలిగివుంటాడు.

13. విశ్వమానవశాంతికి సమస్త దేశాలసహకారం అవుసరమని ఆమోదిస్తాడు.

14. మారటం మానవత్వపుహక్కులలో ఒకటిగా భావిస్తాడు.

15. తాను చేయగలిగిన పనేమిటో తన శక్త్యాను సారం తానే నిర్ణయించుకుంటాడు.

ఈ పైన చెప్పబడినవి ప్రజాస్వామిక నమ్మకాలలో కొన్నిమాత్రమే. ఎందుకంటే ఏదో ఒక తత్వశాస్త్రానికి సంబంధించినటిదిగా గాక ప్రజాస్వామ్యానికి కొన్ని ఖచ్చిత మైన సూత్రాలుగాని. గిరిగీసిన హద్దులుగాని లేవు. మనకు కావలసిన ప్రజాస్వామ్యం ఏమిటో పూర్వంనుంచీ ఇప్పటి వరకూ ప్రజల నడతలను బట్టి అనేకమంది మేధావులు విపులీకరించి మనకు చెప్పినప్పటికి, ఏది ప్రజాస్వామ్యం అనే ప్రశ్న మీాద ఎంతమంది ప్రయత్నించారో అన్ని మార్గాలు సమాధానంగా కనుపించవొచ్చు. అందువలన ప్రజాస్వామ్యా నికి నిర్వచనం ఇది అని చెప్పేదానికి సాధ్యంకాదు. ప్రజా స్వామ్యపు హెచ్చు ప్రయోజనాలను గురించి ఎవరో ఒకరు గిరిగీయటంలో జయప్రదమైనట్లు కనుపించినా అవే హద్దులు గావని చెప్పి దానికి మార్పులు, చేర్పులు సూచించేదానికి ఎప్పుడూ మరొకరు తయారుగానే వుంటారు.

ఈ విధంగా పురాతన గ్రీక్ దేశాలలో అటుపిమ్మట రోమన్ సామ్రాజ్యంలో. అదే సందర్భంలో చైనా, భారత

దేశాలలో యీ ప్రజాస్వామ్యంపట్ల విపరీతమైన ప్రయోగాలు జరిగినా, చైనాలో కన్ఫ్యూషియస్, మెన్షియస్‌లు, గ్రీక్ దేశంలో పెరికిల్స్, సోక్రటీస్, ప్లేటోలు భారతదేశంలో మహావీరుడు, బుద్ధుడు తమ తత్వశాస్త్రంతోపాటు యీ ప్రజాస్వామిక ధర్మాలకుకూడ కొంత జీవాన్ని పోశారు. వారు వేలసంవత్సరాలనాటి ప్రజలైనప్పటికి వారి ప్రతి మాటా సజీవంగా బ్రతికున్నట్లే. ప్రజాస్వామ్యంపట్ల వారి ఆలోచనలు సజీవంగానే వున్నయ్.

అనేకయుద్ధాలు దారుణరోగాలు ఆ మధ్యయుగంలో సంభవించినప్పటికి, వారు ప్రజాస్వామ్య భావపరంపరలను పునర్జీవింపజేస్తూ, అనుకరిస్తూ, అంధకారంలోగూడ కాలం గడిపారు. ప్రజాస్వామ్యాన్ని నమ్మిన అప్పటి వివిధ ప్రజలు, వారి దేశాలమధ్య సరియైన రాకపోకలు లేకపోయినప్పటికి, ఆ ధర్మాలు అచ్చుపుస్తకాలలో, శాసనాలలో లేకపోయినప్పటికి, మానసిక నేత్రాలలో ఆదర్శపురుషులను పెట్టుకొని ప్రజలు ప్రజాస్వామ్యాన్ని పరిపోషించుకుంటూ వచ్చారు. ఈ యుగాలన్నిటిగూడ ప్రజాస్వామ్య ఆశయం పొందిన ప్రత్యేకత ఏమిటంటే మానవునికి సంబంధించి ప్రజాస్వామ్య ధర్మం సాధించింది ఏమి అనేదే.

జంతువులకు భిన్నంగా మానవులు కొన్ని హక్కులు సంపాదించే దానికి ఏవిధంగా వెతుక్కుంటూ వెళ్ళారో, అందులోని కొన్ని ప్రముఖ ఘట్టాలను గురించి

చెప్పుకుందాం. ఈ దీక్ష, కృషి, దీర్ఘకాలానికి చెందిన ఒక తాబేటి నడకలాంటిది. నీటి గుంటలో వేసిన గడ్డవలన బయలుదేరిన తరంగాలమాదిరే, న్యాయస్వాతంత్ర్యాలకు చెందిన హక్కులనేవి, నిరంతరం తెంపులేని తరంగాలుగా బయలు దేరేదానికి, ఆ నడక దోహద మిచ్చింది. ఎప్పుడు ఈ పరిశోధన కార్యక్రమం ప్రారంభమైందో మనం ఊహించ గలం. వ్యక్తి గౌరవంపట్ల మానవుడు జాగ్రత్త చూపెట్టు కోవట మనేది ఎప్పుడూ వుంటున్నప్పటికీ, కాలగమనంలో ఎప్పుడు, ఎక్కడ మానవుల సమానహక్కు గుర్తింపు జరిగిందో చెప్పటం కష్టం. "మానవులు పరస్పరం విలువ కట్టుకోవటం ప్రారంభించినప్పటినుంచీ మనసులో గుర్తించట మనే భావానికి చోటులభించింది" అని అభిప్రాయపడ్డాడు రూసో. మరికొన్ని విధాలగూడ ఆలోచనకు ఆస్కారముండ వచ్చు. నవీన రాతియుగం ప్రారంభమైనప్పటినుండి, వేట గాళ్ళు తమ మొరటురాతి సాధనాలను వదలి వేయటం ప్రారంభించి, సాధుజంతువులను పెంచటం, పంటలను పండిం చటం అలవాటు చేసుకున్నారు. అంతటితో మానవుడు తన యాజమాన్యాన్ని చట్టబద్ధం చేయ సంకల్పించాడు. స్థిమి తాన్ని అందుకోవటానికి, మేధస్సును ఉపయోగ పెట్టడానికి కూడా అది అవసరమనుకున్నాడు. పురాతన రోజుల్లో, పూర్వ రచనలవల్ల తెలుస్తున్న దానినిబట్టి హిబ్రూలకు వారి దేవుడికి మధ్య ఒక ఒప్పందంకుదిరింది. ఈ ఒప్పందమే ప్రజాస్వామ్య భావాలకు సంబంధించిన అత్యంత పురాతన

ప్రణాళిక అని చెప్పవచ్చు. పరిపాలించేవాడికి, పరిపాలించబడే వాడికి మధ్యనున్న ఒప్పందం ఇదే! అప్పటి ప్రాథమిక సమాజం ఆ ఆజ్ఞలను శిరసావహించేదానికి ప్రమాణం చేసింది. నైతికంగా వారు కట్టుబడిపోయారు. అటుపిమ్మట హెబ్రూలు తమ ఇహలోక రాజును ఏర్పాటుచేసుకున్నప్పుడు, ఈ పూర్వపు ఒడంబడికను ఆచరణలోనికి తెచ్చుకొన్నారు. ప్రజలకు, దేవునికి మధ్యనున్న ఒప్పందాన్నే ఆధారంగా చేసుకుని ఎన్నుకోబడిన వారి రాజుకూడ న్యాయంగా పరిపాలించేదానికి ఆమోదించవలసి వచ్చింది.

పూర్వం అనేక దేశాలలో వ్రాతబద్ధమైన చట్టం అనేది ఏదీ లేకపోయినప్పటికీ, తీర్చిదిద్దిన సూత్రాలనేవి ఏవీ కూడ రాజులపట్ల లేవు. అందువలన క్రమంగా ఈ అన్యాయాన్ని సర్దుబాటు చేసేదానికి ఏర్పాట్లు జరిగినవి. మెసపటోమియా (ఇరాక్) సుమేరియన్ సిటీ స్టేట్సులో క్రీస్తుకు పూర్వం 2,500 సంవత్సరాలక్రితం, పౌరచట్టాలు పునరుద్ధరించబడి, వ్రాతబద్ధం చేయబడినవి. అటుపిమ్మట ఐదు శతాబ్దాల తరువాత, పురాతన బాబిలన్‌లో హమురాబి అనే రాజు, తన ప్రజలందరికీ సమానమైన న్యాయహక్కుల్ని కలిగించే హామీనిస్తూ కొన్ని చట్టాలను రూపొందించాడు. దీనినే ప్రస్తుతం వాడుకలో "హమురాబీస్ కోడ్" అంటారు. వ్యక్తుల హక్కులంటే ఏమిటో ఇందులో స్పష్టంగా వ్రాయబడివున్నవి; క్రమంగా మానవులు వ్యక్తిగత హక్కులపట్ల జాగ్రత్త వహించేకొలది వ్యక్తిత్వాన్ని రూపొందించే పద

జాలాన్ని పూనికతో సృష్టించారు. హిబ్రూ దేశభక్తుడైన
మోసెస్ దైవాజ్ఞలను తన ప్రజలకు అందించాడు. "నీవు తె
సుస్త జనులను చూచుకుందువుగాక; తప్పుడు సాక్ష్యం
పలుకకుందువుగాక; పరిహాస్యం చేయకుందువుగాక;"
ఇత్యాదివే ఇంకా ఏను మోసెస్ ద్వారా ప్రజలకందిన
దైవాజ్ఞలు.

ఆ తరువాత 7 శతాబ్దాలకు "ఏది నీపట్ల జరుగరాదని వాంఛిస్తావో అది ఇతరులకు జరగాలని వాంఛించకు" అన్నాడు కన్ఫ్యూషియస్. భారత దేశంలో అసంఖ్యాకమైన శిష్య కోటిని కలిగినటువంటి గౌతమబుద్ధుడు, ప్రపంచములో తన శిష్యులు ప్రచారానికి పోబోయేముందు వారికి ఇలా చెప్పాడు. "అందరి సంతోషంకోసం సంచారం చేయండి. పరులపట్ల దయాళువులై వుండండి. ఇది ప్రపంచానికి లాభం. దేవుళ్లకు మానవులకుకూడ ఆనందదాయకం" అదే మాటలు కాకపోయినా మహమ్మద్ ప్రవక్త ఇలా అన్నాడు. "ఇతరుల పట్ల అన్యాయంగా ప్రవర్తించకండి. మీపట్ల ఇతరుల అన్యాయాన్ని సహించకండి." రోమన్ సామ్రాజ్యంలో అప్పటికి ఒక భాగంగావున్న పురాతన పాలస్తీనా దేశంలో నజరేత్ వాస్తవ్యుడైన జీసస్ క్రైస్ట్ "నీ పొరుగువారిని ప్రేమించు" అన్నాడు.

కొన్ని శతాబ్దాలక్రితం ఇద్దరు గ్రీకులూ, ఒకరోమన్ చేత వ్రాయబడిన చట్టాలకు అనుగుణ్యంగా ఈనాడు కోట్లకొలది

ప్రజలు పరిపాలించబడుతున్నారు. ప్రజాస్వామ్యం అన్న
పదాన్ని సృష్టించినవారు గ్రీకులే! "డెమస్" అంటే ప్రజలు
"క్రిటెన్" అంటే పరిపాలించు; డెమస్ - క్రిటెన్ అన్న గ్రీకు
మాటలలోనుంచి పుట్టిందే ఈనాటి ఇంగ్లీషుపదం డెమోక్రసీ
దీనికి సరి అర్థం "ప్రజాస్వామ్యం". క్రీస్తుకు పూర్వం ఆరవ
శతాబ్దంలో ఏథెన్సు పట్టణంలో ఏర్పడుతున్న పరిస్థితులు
వారిని మేల్కొల్పి ప్రజాస్వామ్యంపట్ల వారికున్న గౌరవాన్ని
బుజువు పరిచేటానికి దోహదమిచ్చింది. ఈ వ్యవహారంలో
పరిపాలనారీత్యా దక్షత చూపించినవాడు పెరికిల్స్. అందులో
సంస్కరణలు అవసరమైన సందర్భాలు వచ్చినప్పుడు
'సలోన్' అనే స్మృతికర్త బైటకు వచ్చాడు. భాగ్యవంతు
లకు, బీదలకు సంబంధించిన చట్టాలను సృష్టించాడు. అప్పు
తీసుకునేవాడి వ్యక్తిగతమైన హామీపై అప్పులుపుట్టే అవ
కాశమిచ్చే అప్పటి పట్టనులను అతడు రద్దుపరిచాడు. ఋణ
దాతల చేతుల్లో అప్పులు తీర్చలేక బానిసలై పోయినవారి
నందరినీ అతడు విముక్తి చేశాడు. ఇప్పటికీ సలోన్ గొప్ప
స్మృతికర్తగా భావించబడుతున్నాడు. "హెలియేయా" అన
బడే న్యాయస్థానాలను అతడు స్థాపించాడు. అందులో విచా
రించే న్యాయమూర్తులను అసంఖ్యాకమైన పౌరగణం ఎన్ను
కుంటుంది.

"ఎక్లేసియా" అనబడే ప్రజాశాసనసభలో అధిక
సంఖ్యాక ఎథీనియన్లు ప్రాతినిధ్యం కలిగి వుండవలసిన
అవసరాన్ని కూడ అతడు గుర్తించాడు ఆయన తన సంస్క

రణాల నుద్దేశించి ఇలా చెప్పాడు. "వారివారి గౌరవ ప్రపత్తు లకు హామీనివ్వనుద్దేశించి సామాన్య ప్రజలకు సరిపోయినంత అధికారాన్ని నేను వారికి ఇచ్చాను." మహో ఎథీనియన్ రాజ్యాంగవేత్త పెరికిల్స్ కూడా ప్రజావాంఛల్ని అర్థం చేసుకున్నాడు. అతడి నాయకత్వంక్రింద ఎథీనియన్ ప్రజాస్వామ్యం మహోన్నతదశకు వెళ్ళింది. రాజకీయంగా పౌరులందరూ సమానంగా వుండాలనే సూత్రాన్ని అతడు నమ్మి ఏథెన్సును స్వపరిపాలనాయుతం చేయటానికి ప్రయత్నించాడు. ప్రతిఫలం పుచ్చుకుంటూ ప్రభుత్వోద్యోగాలను నిర్వహించేందుకు హెచ్చుమంది పౌరుల్ని పెరికిల్స్ ప్రోత్సహించాడు. న్యాయాధిపతులకు జీతభత్యమిచ్చే విధానాన్ని అతడు ప్రవేశపెట్టాడు. పేదపౌరులు కూడ న్యాయాధిపతులయ్యే అవకాశాన్ని కలిగించే చట్టాన్ని తయారు చేశాడు. 18 సంవత్సరాల వయసు మీరిన యువకులందరూ "ఎక్లేషియా" చర్చల్లో పాల్గొనే అవకాశాన్ని కలిగించాడు. ఎథీనియన్ ప్రజాస్వామ్యాన్ని వర్ణిస్తూ "కొద్దిమంది చేతుల్లో కాకుండా పరిపాలనా బాధ్యత అసంఖ్యాకమైన వారిచేతులకు యివ్వబడింది." అన్నాడు. తదుపరి కొంతకాలానికి రోములో ప్లెబియస్ ఎసిపియస్ జస్టీనియన్ తన ప్రజలకు న్యాయశాస్త్రాన్ని బహూకరించాడు. అనేకమైన ఇప్పటి విధానాలకు పాశ్చాత్య దేశాల్లో అదే ఆధారభూతం. క్రీ. శ. 527 లో జస్టీనియన్ చక్రవర్తి అయ్యాడు. అతడు నిద్రాహారాలు లేకుండా గంటలు తరబడి పనిచేయగలిగేవాడు. ఆయన

రోమన్ సామ్రాజ్యానికి పెత్తనం తీసుకోకముందే బహు జాగ్రత్తగా ఆలోచించారు. రోమన్ చట్టాన్ని పునర్వర్గీకరించే దానికి తీవ్రమైన కృషిచేశారు. శతాబ్దాలతరబడి రోమన్ చట్టంలో అసంఖ్యాకమైన విశేషాలు చేర్చబడినవి. అందులో పునశ్చరణమైనవి, పరస్పర విరుద్ధమైనవి అనేక అంశాలు వున్నవి. ఎవరికైనా భాష్యం చెప్పాలంటే దుర్లభమయ్యేది. జస్టీనియన్ సూచనప్రకారంగా, కొంతమంది న్యాయాధిపతులు, ఈ చట్టాలన్నింటినీ క్రోడీకరించే దానికి ఏడేళ్ళపాటు కృషిచేశారు. పునశ్చరణమైన దేదైనా వుంటే, పరస్పర విరుద్ధమైన దేదైనావుంటే, దానిని వారు తొలగించి వేశారు. అటుపిమ్మట దానిని వారు ఆచరణయోగ్యంగా చేశారు. వారికృషికి లభించిన ఫలితాన్ని "డైజెస్టు" అన్నారు. న్యాయానికి మానవహక్కుల పరిరక్షణకు, సంబంధించి, ఇన్ని శతాబ్దాల తరబడి చెప్పబడిన విజ్ఞానఖని యావత్తూ ఈ డైజెస్టులో స్పష్టంగా, తేటతెల్లంగా చెప్పబడింది.

జస్టీనియన్ చేసిన ఈకృషి పశ్చిమార్ధగోళంలో పౌర సంబంధమైన న్యాయానికి మూలమైంది. గ్రీస్ రాజకీయ వేత్తలవలే దాని తాత్వికులుగూడ, ఆలోచనలో ముందంజ వేశారు. సోక్రటీస్, ప్లేటోలు ఉభయులూ మానవులు తమ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కును సమర్థించారు. అధిక సంఖ్యాకుల ఆమోదంతోనే ప్రభుత్వాలు ఏర్పడాలనీ, ఏ సంవత్సరం చూచినా ప్రతి ఆరుగురు పౌరులలో ఒకరికి,

ప్రభుత్వంలో ఏదో ఒకభాగంలో నిర్వహణ బాధ్యత వుండాలని. అది న్యాయస్థానానికి సంబంధించిన దైనప్పటికీ విచక్షణ వుండకూడదని అరిస్టాటిల్ చెప్పాడు. ఇప్పటి ప్రజాస్వామ్య స్థాయిలో మనం ఆలోచిస్తే, ఏథెన్సు స్వల్పకాల ప్రజాస్వామ్యం సంపూర్ణ స్వరూపం పొందలేదు. అది పరిమితమైందే! మొత్తం ప్రజలలో విదేశస్తులు - బానిసలు అధిక సంఖ్యాకులుగా వున్నా, ఈ నాటి దక్షిణాఫ్రికాలోని భారతీయులు, నీగ్రోలు మాదిరిగానే వారు పౌరహక్కుల నుంచి మినహాయించ బడ్డారు. అయితే అది ప్రారంభదశలో మాత్రమే

గ్రీసును రోమన్ వీరులు జయించారు. అయినప్పటికీ అక్కడ పుట్టి పెరుగుతున్న భావపరంపరలు అంతటితో అంతంకాలేదు. ఆ ప్రభావం రోమన్లమీదనే గాకుండా వారిమధ్య పుట్టిన (క్రొత్తకె)సన మతంమీదకూడ పడింది. జెనో శిష్యగణమైన స్టాయిక్సునుంచి ఒక గ్రీస్ తత్వశాస్త్రజ్ఞుని మూలాన రోమన్ చట్టం (240-260 క్రీ॥ పూ॥) ఒక నూతన విధానానికి దోహదం కల్పించింది. మానవులందరూ దేవుని బిడ్డలు కావటంవలన వారందరూ అన్నదమ్ములన్నారు. ప్రకృతి సిద్ధమైన, లేక నైతికమైన ఒక చట్టం సహజంగా వుందని జెనో శిష్యులు ప్రకటించారు. అది మానవుడికి కొన్ని కనీసహక్కుల్ని సంక్రమింప చేస్తుంది. అది లేనిదే వారి వ్యక్తిత్వమే లేదు. ఈ ప్రాకృతిక చట్టాన్ని ఆచరణలో పెట్టాలంటే, ప్రభుత్వాలు సాంఘిక సంస్థా స్వరూపాలు

అలాంటి హక్కుల్ని గుర్తించవలసిందిగా, తద్వారా మానవ సౌఖ్యాన్ని సంరక్షించవలసిందిగా ఆ న్యాయం ఆదేశిస్తుందన్నారు.

రోమన్ సామ్రాజ్యంలో మహావక్త అయిన సిసిరో తన 'రిపబ్లిక్' అన్న పుస్తకంలో ఇలా వ్రాశాడు. "శాశ్వతమైనది, మార్చటానికివీలులేనిది, సమస్త కాలాలకు, ప్రజలకు సంబంధించిన చట్టం ఒకే ఒకటి వున్నది. సమస్త మానవులకు పాలకుడు ఒకే ఒకడు వున్నాడు; ఆయనే దేవుడు. ఈ ప్రాకృతిక చట్ట నిర్మాత ఆయనే! ఆయనొక్కడే దాన్ని ఆచరణలో పెట్టించ గలిగినవాడు. నిర్వచనకర్త కూడ ఆయనే. ఎడతెగకుండా స్వేచ్ఛావాయువులు పీల్చుకోవటానికి, ప్రజలకు కావలసిన అధికారం ఆ ఒకే ఒకదానిలో తప్ప దేనిలోనూ లేదు.'' మనలో అనేక మందిమి మధ్యయుగాన్ని అంధకార యుగంగా పిలుస్తాం. కానీ చారిత్రకాధారాలకు కావలసిన ఒక గొప్ప నిదర్శనం, మధ్యయుగపు రెండవ అర్ధభాగంలో కనుపిస్తుంది.

ప్రజాస్వామ్యం బహుముఖం, విశ్వరూపంలో వుంటుంది. లోగడ ప్రజాస్వామ్య పరిధుల్ని పరామర్శించే సమయంలో ఈ విషయం చెప్పుకొన్నాం. ఇంతకు ముందే చరిత్రలో ప్రజాస్వామ్య పునాదుల్ని గురించి విపులంగా కాకపోయినా కొంతవరకు చెప్పుకున్నాం. ఇక మనం సర్వాంగ సుందరమైన ప్రజాస్వామ్యానికి గట్టి పునాదులు ఎలాపడ్డవో చూడవలసి వుంది.

ఇంగ్లండులోని రన్నిమెడ్ అనేచోటవున్న పచ్చిక మైదానంలో 1215 జూన్ 15 వ తారీఖున ఏకాభిప్రాయానికి వొచ్చిన కొంతమంది పెద్దమనుష్యులవర్గం తమ రాజువలన కొంత న్యాయాన్ని పొందటానికి చేరారు. ఈ గొప్ప ఛార్టరు సుదీర్ఘకాలం మనగల రెండు సంఘటనలకు దారి చూపింది. (1) రాజుయొక్క అధికారాన్ని పరిమితంచేసింది. (2) రాజుయొక్క సర్వసత్తాక అధికారంకంటె మానవ హక్కులు ప్రధానం అని నిరూపించింది. "స్వేచ్ఛా మానవుడెవరైనా తీసుకపోబడటంగాని, బంధింపబడటంగాని, దోచుకోబడటంగాని, చట్టాతీతం చేయబడటంగాని, ప్రవాసుడుగా చేయబడటంగాని, ఏవిధంగానైనా నాశనం చేయబడటంగాని, అతడిపట్ల న్యాయాధిపతి యిచ్చిన తీర్పులు దేశచట్టానికి భిన్నంగా జరుగరాదు. ఏ ఒక్కడినీ అమ్మటంగాని తృణీకరించటంగాని, న్యాయహక్కులపట్ల నిర్లక్ష్యతగాని మనం చూపం.' ఇది మాగ్నా కార్టా ప్రకటన.

ఎవడైనా ఒక మానవుడు తన కుటుంబపోషణ జరుపుకోవటానికి వీలులేనంత క్లిష్టపరిస్థితులను కల్పించే విధంగా అతడు తప్పు చేసినప్పుడు, భరించటానికి వీలులేని నేరస్థపు పన్నులు వేయటాన్ని మాగ్నాకార్టా నిషేధించింది. తమ వస్తువులను ఎక్కడికి వెళ్ళి అయినా అమ్ముకోవటానికి వ్యాపారస్థులకి స్వేచ్ఛ కల్పించింది. ఏ రైతు పంటనైనా నష్టపరిహారం లేకుండా తీసుకుపోవటమనేది భావ్యంగాదని నిషేధించింది.

అంధకార ప్రపంచంలో మాగ్నాకార్టా ఒక్కటే మానవునికి ఆశాకిరణంగాదు. అంతకు ఆరు శతాబ్దాలకు పూర్వమే సెయింట్ అగస్టిన్ దైవచట్టం ఒక్కటే సమంజసమైన చట్టం అని నమ్ముతూ చెప్పాడు

ప్రజలందరి ఆమోదంతో అటువంటి చట్టాన్ని చేస్తుంగాని, ప్రజాభిప్రాయాలను ప్రతిబింబింపజేసే రాజువలన గాని అవి చేయబడవచ్చునని సెయింట్ థామస్ అభిప్రాయపడ్డాడు. సెయింట్ అంబ్రోజ్ మరో అడుగు ముందుకువేసి దైవన్యాయచట్టాన్ని అతిక్రమించిన రాజులను రాజులుగా గుర్తించవద్దని మతగురువులను కోరాడు.

కార్లైల్, జాన్ ఆఫ్ సాలిస్‌బరీ లవంటివారు ప్రజాస్వామ్య ఆశయాలకు అమోఘమైన సేవచేశారు. అమెరికా దేశంలో, ఫ్రెంచి దేశంలో విప్లవాలు వొచ్చే కాలానికి చాలా ముందుగానే అన్యాయంమీద తిరుగబడేహక్కును మానవులు కలిగివున్నారని వారు ప్రబోధించారు. పరిపాలకులు దైవచట్టాన్ని అతిక్రమిస్తే, మానవులు వారికి విధేయులై వుండనవుసరము లేదని ప్రబోధించాడు. సాలిస్ బరీ, మాగ్నాకార్టా ప్రకటించిన ఏభై ఏండ్ల అనంతరం ఇంగ్లండులో పార్లమెంటు ఏర్పడింది. ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, స్పెయిన్ దేశాలలోని ప్రజలు 13 వ శతాబ్దంలో కొన్ని హక్కులు సంపాదించారు, "ఆల్తింగ్" అనబడే ఐస్‌లాండ్ పార్లమెంటు 980 వ సంవత్సరంనుంచి ఏర్పడివుంది. స్విట్జర్లాండ్ శాసన

సభ 1294 వ సంవత్సరములో తొలిసమావేశం జరుపుకుంది. మాగ్నా కార్టా ప్రకటన ఊహాప్రపంచంలోవున్న మేధావులందరినీ కదిలించింది.

థామస్ ఎక్వినాస్ ప్రజాభిప్రాయంచేత, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులచేత మాత్రమే చట్టాలు చేయబడాలని ప్రకటించాడు, 14–వ శతాబ్దపు ఇటలీదేశస్థుడైన మార్సిలియస్ రాజులు, పోపులు, ప్రజల ఏజంట్లు మాత్రమే నన్నాడు. జకోస్లోవేకియాలోని జాన్ హస్, స్కాట్లండ్‌లో రాబర్టుబ్రూస్, స్పెయిన్‌లో డికార్వాంటిస్ ప్రజలలో అంతులేని చైతన్యాన్ని కలిగించారు.

17–వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో హెబియస్ కార్పస్ దరఖాస్తుకుదోహదమిచ్చేచట్టంఏర్పడింది. తరువాత పదేండ్లకు మానవుని వ్యక్తి స్వాతంత్రాలను కాపాడేందుకు 'బిల్ ఆఫ్ రైట్స్' అమలులోకి వొచ్చింది. ఈ విధంగా స్వాతంత్రానికి, న్యాయానికి పునాది ఏర్పడింది. స్వేచ్ఛగా వూహించటం ఆరంభమైంది. ప్రజలలో అవకాశం కలిగినవారు పుస్తకాలు వ్రాయటం, ప్రచురించడం ప్రారంభమైంది. మాసపత్రికలు, పక్షపత్రికలు, వారపత్రికలు ప్రారంభమైనవి. అనేకసమస్యలను చర్చావేదికలుగా చేసుకొని ప్రజలు వాదప్రతివాదములలో బడ్డారు. భావప్రకటన విజృంభించింది. ఖగోళ శాస్త్రజ్ఞుడైన గెలిలియో 1642—వ సంవత్సరంలో తన 78–వ ఏట మరణించాడు. అతడు వూహా కందని ఒక సిద్ధాంతాన్ని

ప్రతిపాదిస్తే పాలకుల దృష్టిలో నేరస్థుడయినాడు. సూర్యుడు స్థిరంగా వుంటున్నాడని, భూమి సూర్యునిచుట్టూ తిరుగుతుందని అతడు చెప్పిన క్రొత్త భావం. న్యాయాధిపతులు అతడిపై ఇచ్చిన తీర్పును విన్న తరువాత "ఫరవాలేదు అది తిరుగుతూనే వుంటుం"దన్నాడట గెలిలియో. గ్రుడ్డివాడైన తరువాత మిల్టన్ భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని గురించి "నాకు తెలుసుకోవటానికి స్వాతంత్ర్యం ఇవ్వు" అన్నాడు. మనస్సులో వున్నదున్నట్లు మాట్లాడటానికి, స్వేచ్ఛగా వాదించటానికి స్వాతంత్ర్యం అన్ని స్వాతంత్ర్యాలకంటె ముందుగా కావాలన్నాడు.

ఇలాగ ప్రజాస్వామ్యంలో కొన్ని ప్రాథమిక ఆశయాల కోసం ప్రపంచంలోని వివిధ దేశాలలోని మేధావులు తమ శక్తియుక్తు లన్నింటినీ వినియోగించి ఆనాడు పాలకులతో పోరాటంలో కృతకృత్యులవటమే గాకుండా ప్రజాస్వామ్యాన్ని సూత్రీకరించటంలో చేసిన కృషికి మనం ధన్యవాదాలు చెప్పవలసివుంది.

అనాగరిక ప్రపంచంనుంచి నాగరిక ప్రపంచంవరకు ప్రజాస్వామ్య సాంప్రదాయం పరిణామం పొందటాని శతాబ్దాలకాలం పట్టింది. ఈ నాటికిగూడ కొన్ని ప్రాంతాల లోని అధికసంఖ్యాక ప్రజలకు దాని అనుభవమే లేదు. వారు దానిని సక్రమంగా అర్థంచేసుకోలేదు. ఒక వేళ సక్రమంగా అర్థంచేసుకున్నా, సక్రమంగా అమలులో పెట్టుకోలేదు.

అనేక శతాబ్దాల పరిశోధనా ఫలితంగా ప్రపంచం మొత్తంలో రెండు దేశాలలో ప్రజాస్వామ్యం పరిణతి పొందింది. అవి (1) స్విట్జర్లాండ్, (2) ఇంగ్లండ్.

జర్మనీ, ఇటలీ, బర్గండీలలోనుంచి కొన్ని కొన్ని ముక్కలు ఒకజాతిగా ఏకమై ఏర్పడిన క్రొత్త స్వరూపమే స్విట్జర్లాండ్. తమపై దాడికి వొచ్చే ఎవరిపైనైనా సంయుక్త చర్యలు తీసుకోవాలనే నినాదంతో మూడు రాష్ట్రాలు 1291 లో హాప్స్‌బర్గ్స్ మీద తిరుగుబాటుచేసి శాశ్వతంగా సమ్మేళనమైనవి. 1353 నాటికి యీ మూడు రాష్ట్రాలకు తోడు క్రమంగా మరికొంత భూమి ఆక్రమించబడింది. రాష్ట్రాలకు విస్తృత ప్రతిపత్తినిస్తూ 1394 లో కేంద్ర డైట్ (పార్లమెంటు) ఏర్పడింది 1648 వెస్ట్‌ఫేలియా సంధితో స్విట్జర్లాండ్ సర్వసత్తాక ప్రతిపత్తిని ఆచరణలో సాధించుకొంది. మూడు శతాబ్దాలపాటు అది మత తగాయిదాలతో అంతరంగికంగా సతమతమైనప్పటికి బయిటనుంచి వచ్చిన దాడులవలన అంతులేని ఐక్యతను సాధించుకొన్నది. కారల్ మార్క్స్ తన కమ్యూనిస్టు మానిఫెస్టో ద్వారా కార్మిక నియంతృత్వ సూత్రాన్ని ప్రతిపాదించిన సంవత్సరమే అంటే 1848 వ సంవత్సరము లో స్విట్జర్లాండ్ కేంద్రప్రభుత్వం బలమైన ప్రభుత్వంగా తనకుతానే రూపొందింది. మొత్తం 22 రాష్ట్రాలకు విస్తృతాధికారాలను ఇచ్చే రాజ్యాంగాన్ని అది రూపొందించుకున్నది. ఆ శతాబ్దమంతా అనేక మార్పులు జరిగినై. ఫలితంగా పత్రికాస్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్యం

లభ్యమైనయ్. చట్టం దృష్టిలో సమానత సాధించబడింది. సాంఘిక న్యాయానికి సంబంధించిన చట్టం చేయబడింది. ఇప్పుడు ప్రతి నాలుగేళ్లకు కేంద్రశాసనసభకు ఎన్నికలు జరుగుతాయి ఓటు కలిగిన ఏ వ్యక్తి అయినా ఎన్నుకోబడవచ్చు. ఏర్పడిన కేంద్ర సుప్రీంకోర్టు వ్యక్తి హక్కులకు గ్యారంటీ నిస్తుంది. 20–28 సంవత్సరముల మధ్య వయస్సు కలిగిన మగవారందరు సైనిక శిక్షణకు అర్హులు. దేశరక్షణకు కావలసిన ప్రజాసైన్యానికి యీ వయస్సులో పౌరులకు అనుభవజ్ఞులైన వారు శిక్షణ నిస్తారు.

1688–వ సంవత్సరములో ఏర్పడిన ప్రభుత్వాన్ని గుర్తించటానికి హాలెండ్ నుండి విలియమ్, మేరీలు ఇంగ్లండ్ కు వచ్చినప్పుడు బ్రిటిష్ ప్రజలు దీనిని "రక్తపాత రహిత విప్లవమని" లేక "గ్లోరియస్ రివల్యూషన్" అని అన్నారు. ఇంగ్లండ్ చరిత్రలో ప్రజాస్వామ్య ప్రభుత్వ అభివృద్ధికి ఇదొక ప్రధాన సంఘటనగా దోహదమిచ్చింది లోగడ రెండవ జేమ్సు పార్లమెంటును రద్దుచేస్తే ప్రజలలో విపరీతమైన సంచలనం వొచ్చింది. వారు గతంలో అనేక కష్టనష్టాలకు వోర్చి క్రమంగా సంపాదించుకొన్న అసంఖ్యాకమైన హక్కుల్ని ఇలా జేమ్సు కలంపోటుతో కోల్పోవటం మహాదారుణం అని భావించారు. అందువలన విలియమ్ను ప్రభుత్వాధిపత్యాన్ని వహించమని కోరారు. విలియమ్ టార్బేవద్ద సైన్యాలతో విడిది చేశాడని తెలియగానే రెండవ జేమ్సుసింహాసనాన్ని పరిత్యజించాడు. ప్రతిఘటన లేకుండానే

విలియమ్ లండన్‌లో ప్రవేశించాడు. హక్కుల ప్రకటనను ఆమోదిస్తే సింహాసనం మీద కూర్చోబెడతామన్నారు ప్రజలు. విలియమ్ ఆమోదించాడు. మరొకమారు పార్లమెంటుయొక్క ఆధిక్యత పునరుద్ధరించబడింది. ప్రజాస్వామ్య పూరితంగా జీవించటానికి ఇంగ్లీషు ప్రజల చరిత్రలో "గ్లోరియస్ రివల్యూషన్" ఒక మైలురాయి మాత్రమే. మన మింతకు ముందే మాగ్నాకార్టాను గురించి చెప్పుకున్నాం. అదే ఆధునిక ఇంగ్లీషు రాజ్యాంగానికి, రాజుపై ఆధిక్యత చట్టానికి కల్పించే పునాదులు వేసింది. 1647 లో "ప్రజాఒడంబడిక" అనేది రూపొందించ బడింది. ఇది రాజుకు ప్రజలకు వుండే అధికార పరిమితులను నిర్ధారణ చేసింది. ప్రభుత్వ దైనందిన సంస్థగా పార్లమెంటు వ్యవస్థీకరించ బడింది. ఇంతకుముందు రాజుకుండే కార్యాచరణ అధికారాలన్నీ మంత్రివర్గంద్వారా పార్లమెంటుకు సంక్రమించినాయి. తరువాత పౌరహక్కులను సంపాదించేదానికి ప్రజలు ప్రత్యేకంగా కృషి చేశారు.

1777 వ సంవత్సరంలో అమెరికాలో విప్లవం బయలుదేరింది. ప్యాట్రిక్ హెన్రీ అనే ఒక న్యాయవాది "బానిస బంధాలనే విలువతో అమూల్యమైన జీవితాన్ని, మాధుర్యమైన శాంతిని, ఖరీదు చేయవలసిందేనా! సర్వేశ్వరా! దీనిని శాసించు, ఇతరులు ఏమార్గాన పోతారో నాకు తెలియదుగాని నావరకు నాకు మాత్రం స్వేచ్ఛనైనా ఇవ్వు. లేక మరణమైనా ప్రసాదించు" అని ఇలా ఘోషించాడు. ప్రజా

స్వామ్యం అనే ప్రాథమిక సత్యంపట్ల అమెరికాను రూపొందించిన వారిలో ఒకడైన అబ్రహాంలింకన్ "నేనేవిధంగా బానిసను కాకూడదని అనుకుంటున్నానో అదేమాదిరిగా యజమానిగా కాకూడదనుకుంటున్నాను. ఈ ఒక్కమాటే నా ప్రజాస్వామ్య ఆశయాన్ని తెలియజేస్తుంది. దీనితో భేదించవలసినంతగా భేదించేది ఏదయినా ప్రజాస్వామ్యం కానేరదు." అని సింహగర్జన చేశాడు.

అమెరికా 13 రాష్ట్రాలు ఏకగ్రీవంగా ఆమోదించిన 1776 జులై 4 వ తేది కాంగ్రెస్‌లో ఆమోదించబడిన స్వాతంత్ర్య ప్రకటన ఏకగ్రీవంగా ఇలా చెపుతుంది. "మానవ చరిత్రలో కొన్ని సంఘటనలు జరిగినప్పుడు ఒక దేశంతో తమకు రాజకీయంగా వున్న సంబంధాలను మరొక దేశం తెగ తెంపులు చేసుకోవలసిన అవసరమేర్పడుతుంది. సహజ దైవిక శాసనాలను గలిగి సమానస్థాయిని ప్రపంచరాజ్యాలతో పాటు పొందవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. అలాంటి కారణాలన్నింటిని తప్పనిసరిగా ప్రకటించటం ఒక దేశ ప్రజల ధర్మమైవున్నది. మానవత్వం యెడల గౌరవమర్యాదలు గలిగినవారు అలా చేయాలి.

"మానవులందరూ సమాన హక్కులు గల వారుగా సృష్టించబడ్డారు. భగవంతుడు వారికి తిరుగులేని హక్కులను ప్రసాదించాడు. జీవించటం, స్వాతంత్ర్యం అనుభవించటం, సుఖపడటం ఇవి దైవదత్త హక్కులని మానమ్మకం. ఈ హక్కులను సాధించి పెట్టటానికే మానవులకు ప్రభుత్వా

లేర్పడినవి. వాటికి న్యాయమైన అధికారాలను ప్రజలే ఇస్తారు. ఒక ప్రభుత్వ మేదయినా ఈ లక్ష్యాలను రద్దు చేయ బూనుకుంటే దానిని మార్చటానికే గాని, అదృశ్యం చేయ టానికిగాని ప్రజలకు అధికారం గలదు. తమ సుఖానికి భద్ర తకు తోడ్పడగల పద్ధతులతో ప్రజలు చర్యలు తీసుకోవాలి. అందుకు గాను సూత్రాలను రూపొందించుకొని తగు అధి కారాలతో క్రొత్త ప్రభుత్వాన్ని స్థాపించుకోటానికి ప్రజలకు హక్కుగలదు. అయితే ప్రాచీనంగా ఏర్పడిన ప్రభుత్వాలను తాత్కాలిక స్వల్ప కారణాలచేత మార్పు చేయటం వివేక వంతమయిన పనిగాదు. అటువంటి ప్రభుత్వాలను మార్పు చేయ ప్రయత్నించటంకంటె వాటివల్ల కలిగే స్వల్పమైన కష్టనష్టాలను అనుభవించటానికే ప్రజలు ఇష్టపడతారు. మానవులెన్ని బాధలైనా పడతారుగాని తాము చిరకాలంగా అలవాటుపడిన వ్యవస్థను మార్చుకోవటానికి ప్రయత్నించరు. మానవులందరికి ఇది అనుభవంలోవున్న విషయమే. కాని ఒక ప్రభుత్వం ఏదో ఒక లక్ష్యంకోసం అదేపనిగా అధికార దుర్వినియోగం చేస్తూవుంటే, నిరంకుశంగా ప్రజలను పాలిస్తే ఆ ప్రభుత్వాన్ని కూలద్రోయటం, తమ భవిష్యత్ భద్రతకు తగు జాగ్రత్త తీసుకోవటం, ప్రజలకుండే ఒక హక్కేగా కుండా అది ఒక విధికూడ..."

ఈ విధంగా ఒకజాతిచేసిన ప్రకటన అనేక దేశాలను స్వాతంత్ర్యోన్ముఖంగా పురోగమింపజేసేదానికి చరిత్రలో ఎంతో తోడ్పడింది. అమెరికా, ఫ్రాన్సు దేశాలు చేసిన

స్వాతంత్ర్య ప్రకటనలు స్వేచ్ఛాప్రియులకు మార్గదర్శకాలు. ఫ్రాంసు దేశంనుంచి ప్రపంచానికందిన ఆశయం "స్వాతంత్ర్యం, సోదరత్వం". అమెరికా దేశంనుంచి అబ్రహాం లింకన్ ద్వారా ప్రపంచానికందిన మరొక సందేశం "ప్రజల యొక్క ప్రభుత్వం, ప్రజలవలన ప్రభుత్వం, ప్రజల కొరకు ప్రభుత్వం". ఇక సిసలైన ప్రజాస్వామ్య లోతుపాతులను పరిశీలిద్దాం.

అసలు ప్రజాస్వామ్యమనేది ఒక మానసిక స్థితిని వ్యక్తంచేసే సత్యం. ఈ మానసికస్థితి మూడు విధాలుగా వుంటుంది.

(1) అధిక సంఖ్యాకులకు సంబంధించినది.
(2) అల్పసంఖ్యాకులకు సంబంధించినది.
(3) వ్యక్తికి సంబంధించినది.

ప్రజాస్వామ్యానికి సులభమైన నిర్వచనం సర్వసాధారణంగా రాజకీయంగా దొరుకుతుంది. రాజకీయాలు అనగానే ముందు కనిపించేది ప్రభుత్వం. అందువలన ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వానికి అన్వయింపచేసిచూద్దాం. ప్రభుత్వం రాజ్యాంగ బద్ధం. రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాలు అధికసంఖ్యాకులవి; అల్పసంఖ్యాకులవి; వ్యక్తులవి; అనే మూడురకాలుగా వ్యవస్థీకరింపబడుతున్నవి. ఏ ప్రభుత్వానికైనా కొన్ని విధులు-బాధ్యతలు-అధికారాలు వున్నవి. సంఘపరంగా వాటిని నిర్వహించటానికే ప్రభుత్వం. ప్రభుత్వం, దాని అధికారాలు కొన్ని భౌగోళిక హద్దులకు పరిమితం. ఆ హద్దుల్లోవున్న ప్రజలందరికీ

అది బాధ్యత వహించవలసివుంది. ప్రభుత్వలక్ష్యం అందరి కోసరమైనప్పటికీ, ఏర్పడిన ఏ ప్రభుత్వం అందరికీ బాధ్యత వహించటంలేదు. అందువలన అధికసంఖ్యాకులు, అల్పసంఖ్యాకులు, వ్యక్తులు అనే మూడు సమస్యలు ఉత్పన్నమౌతున్నవి. మొట్టమొదట మనం ప్రజాస్వామ్యాన్ని ఒక మానసికస్థితిగా చెప్పుకున్నాం. అందువలన పైమూడింటి మానసికస్థితుల్ని మనం పరిశీలించ వలసివుంది. అందులో ప్రభుత్వం అధిక సంఖ్యాకులది అనుకున్నప్పుడు అక్కడ ప్రజాస్వామ్యపు అధిక సంఖ్యాకుల మానసికస్థితిని మొదటగా పరిశీలిద్దాం.

ప్రభుత్వంలో అధిక సంఖ్యాకులకువున్న అవకాశాలు, అల్పసంఖ్యాకులకు వుండవు. ప్రభుత్వం అందరికోరకు అని అనుకున్నా అలావుండటం సాధ్యంకాదు కాబట్టి, వీరైనంత హెచ్చుమందిదిగా ప్రభుత్వం వుంటుంది. ఇది కొంతవరకు సబబుగా వున్నట్లు తోస్తుంది. ఎందుకని? సంఘం అనేదివుంది అంటే దానికి ప్రభుత్వమనేది వుండితీరుతుంది. ఇందులో అధిక సంఖ్యాకుల హక్కు ఎందుకు విధికృత మౌతుందో చూద్దాం. ప్రజాస్వామ్య జీవితంలో రాజకీయాలు వుండటం తప్పనిసరి అయినా వాటికిమించింది ఇంకేదో వుందనేదికూడ ఋజువుకౌతుంది. ప్రజాస్వామ్యం అధికసంఖ్యాక ప్రజల్ని ఉద్దేశించి చెప్పేదిగాక, అది అధికసంఖ్యాకుల భావాల్ని ఆచరణలో పెట్టేదిగా వుంటుంది. ఒకప్పుడున్న అధికసంఖ్యాక వర్గం ఎల్లప్పుడూ వుంటుందని ఆశించలేం. ఒకప్పుడున్న అల్ప సంఖ్యాకవర్గం తన ఆశయ ప్రచారంద్వారా ప్రజలలో అధిక

సంఖ్యాకవర్గంగా మారవచ్చు. అధిక సంఖ్యాకులు ప్రభుత్వ అజమాయిషీలోవున్నా ఇలాంటిఅవకాశాన్ని అల్పసంఖ్యాకుల కివ్వకపోతే అది ప్రజాస్వామ్య మనిపించుకోదు.

ఎవరికైనా పరిపాలించటం ఎంతటి సదవకాశమో అంతటి బాధాకరంకూడ. కొందరు పదవుల్లోవుండే ఆనందాన్ని అనుభవిస్తుంటే, కొందరు పదవిలోవుండే దుఃఖాన్ని భరించ లేరు. ఎవరైతే పరిపాలించే హక్కును స్వీకరిస్తారో, వారు రానున్న సాధకబాధకాలను భరించే హక్కునుకూడా స్వీకరిం చాలి. ఒక ప్రభుత్వ బలహీనత ప్రజాస్వామ్యానికి ప్రమాదం తెచ్చిపెట్టినట్లే, ఒక ప్రభుత్వ బలంకూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదం తెచ్చిపెడుతుంది. ఈ ప్రమాదం బలహీనమైన దానిలోనే హెచ్చుగా వుంటుందని కొందరి అభిప్రాయం.

కొన్ని సందర్భాలలో ద్వంద్వ ప్రజాస్వామ్యతత్వం కనిపిస్తుంది. వ్యక్తులుగా అధిక సంఖ్యాకవర్గంలో హెచ్చు మంది వుంటున్నందువలన. అధికసంఖ్యాక భావం అమలు జరుగుతుంటే దానికి అల్పసంఖ్యాకవర్గం ఆమోదం తెలుప వలసివుంటుంది. పెద్దముఠా ఏదికోరుతుందో దానిని చిన్న ముఠా సరేననవలసి వుంటుంది. ఇదే అధిక సంఖ్యాకవర్గపు మానసికస్థితి. అయితే ఈమాత్రమే చాలదు; అధిక సంఖ్యా కుల మూర్ఖతకు అల్పసంఖ్యాకుల మూర్ఖతకు తేడాలేదు. మూర్ఖ్యం ఎవరిలోవున్నా మోతాదు తేడాతప్ప అసలుతేడా వుండదు. అపాయాల సందర్భంలో జంతువులన్నీ ఒకచోట చేరినట్లే, అరిస్టాటిల్ భాషలో "రాజకీయ జంతువులైన

మానవులుగూడ ఒకఆలోచనను సంపూర్ణంగా బలపర్చవచ్చు; లేక ఒక వ్యక్తిని సంపూర్ణంగా బలపర్చవచ్చు. ఇదే యుద్ధ సమయాలలో జరుగుతూవచ్చింది. యుద్ధానికిముందు జర్మనీలో హిట్లరు, ఇటలీలో ముస్సోలినీ తమకు అధిక సంఖ్యాకుల బలంవుందని చెప్పుకున్నారు. అలాగే స్టాలిన్ తనకు అధిక సంఖ్యాకుల ఆమోదముద్రవుందని చెప్పుకున్నాడు. ఇంగ్లండ్‌లో గూడ అధిక సంఖ్యాకుల ఆమోదంతోనే చర్చిల్ పెత్తనం చేశాడు. బలమైన అంతరంగిక శత్రువుల్ని దృష్టిలో పెట్టుకుని అధిక సంఖ్యాకుల చరిత్రలో నియంతృత్వాలకే ఓటుచేసిన సందర్భాలు వుండవచ్చు. అందువలననే ప్రజాస్వామ్యం అంటే, అధిక సంఖ్యాకుల ఆమోదంతోనేవుండే ప్రభుత్వం అని ఆమోదించలేం అధిక సంఖ్యాకుల ప్రభుత్వ వ్యవస్థీకరణ అనేది ప్రజాస్వామ్యంలో ఒకభాగం మాత్రమే!

ఇంగ్లండ్‌లో యుద్ధకాలంలో చర్చిల్ సేవలను పొందిన అధిక సంఖ్యాక ప్రజలే, యుద్ధానంతర శాంతికాలంలో, ప్రభుత్వాన్ని ఎన్నుకోవలసి వచ్చినప్పుడు ఆయన్ను త్రోసి వేశారు. కానీ పురాతన వ్యవస్థ అయిన రాజరికాన్ని అధిక సంఖ్యాకుల ఆమోదంతోనే అట్టిపెట్టుకున్నారు. అలాగే, అధిక సంఖ్యాకులు జారు ప్రభుత్వాన్ని కూలద్రోసి రష్యాలో స్టాలిన్ నియంతృత్వానికే ఆమోదముద్రవేసిన సందర్భం కూడ గమనంలో పెట్టుకోవాలి. అందువలన ప్రజాస్వామ్యమంటే అధిక సంఖ్యాకులకు చెందిన ప్రభుత్వమేనని చెప్పటం తప్పు భావ మౌతుంది.

ఇక ప్రజాస్వామ్యాన్ని అల్పసంఖ్యాకులకు అనువర్తింపచేసి చూద్దాం. ప్రజాస్వామ్యం అల్ప సంఖ్యాకుల మానసిక స్థితి అని అనుకుందాం. రెండవ అంశంగా అధిక సంఖ్యాకుల పట్ల అల్ప సంఖ్యాకుల మానసిక స్థితిని పరిశీలిద్దాం. ఈ మైనారిటీ వ్యవహారంగూడా రాజకీయంగానూ, ప్రభుత్వ పరంగానే పరిశీలిద్దాం. ఇప్పుడు శాసనసభలలో అల్ప సంఖ్యాకుల వర్గం ప్రతిపక్షంగా వుంటుంది. ప్రభుత్వ పక్షం ప్రతిపక్షం అనేవి రెండూ రెండూ పదాలు. ప్రభుత్వం ఏదో ఒకటి చేయాలనుకుంటుంది. అల్ప సంఖ్యాకులకు ప్రతిబింబమైన ప్రతిపక్షం దానిని ప్రతిఘటిస్తుంది. ఇలా చేయటంలో దానికి రెండభిప్రాయాలుంటవి. 1. ప్రభుత్వపు జగన్నాథ రథ చలనానికి కొలికవేయటం 2. తన భావాన్ని అధిక సంఖ్యాకులచేత ఆమోదింపచేయటం. వీలుంటే, ఆ ప్రకారం శాసనం చేయించటం. ఒక్కొక్కమారు 1948 49 లో మాదిరిగా అల్పసంఖ్యాక వర్గం భారతదేశంలోని కమ్యూనిస్టుల వలె అధిక సంఖ్యాలకు మీద తిరుగుబాటు చేయటం జరుగుతుంది. ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో అధిక సంఖ్యాకుల మనస్తత్వం లొంగదీయటానికి వున్న సమస్త అవకాశాలు ఒట్టిపోయినపుడు మాత్రమే యీ దుందుడుకు పద్ధతి అల్పసంఖ్యాకవర్గానికి ఆచరణీయమైతే కావచ్చునేమోగాని లేకపోతే అది పార్లమెంటరీ సాంప్రదాయంలో లభించే సమస్త అవకాశాలను ఉపయోగించుకొనే ప్రజాస్వామ్యానికి నమ్మకమైన మిత్రబృందంగానే వుండితీరాలి.

అల్ప సంఖ్యాకవర్గం అది ఏంజేసినా తన మనుగడను దృష్టిలో పెట్టుకునే చేస్తుంది. తాను చట్టబద్ధంగా సతల్ఫితాలు వొచ్చేవిధంగా తన నడతను సరిదిద్దుకోవలసి వుంటుంది. అల్ప సంఖ్యాక ప్రజాస్వామిక వర్గాలు ఆత్మగౌరవానికి ప్రాధాన్యత నిస్తవి. ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొన్నందువలననే భవిషత్తులో గూడ వాటి మనుగడకు భద్రత లభిస్తుంది. అవి తమకై తాము హక్కుదారులమని అనుకొనటమే గాకుండా ఉపయోగకరమని గూడ భావించుకోవలసివుంటుంది. అల్ప సంఖ్యాకవర్గం తన విధి నిర్వహణలోనే తన హక్కును నిరూపించుకోవాలి. అధిక సంఖ్యాక అధికారవర్గాన్ని తప్పుదారిన బడకుండా హెచ్చరించే విషయంలో అల్ప సంఖ్యాక వర్గం అంతర్గతంగా పరిపాలనలో భాగస్వామి అవుతుంది. ఈ విధంగా ప్రజాస్వామ్య సమాజంలో అధిక సంఖ్యాకుల పాత్రకు అల్పసంఖ్యాకుల పాత్ర ఏమీ తీసిపోయేదిగాదు.

పరిపాలనలో అల్పసంఖ్యాకవర్గమే గాకుండా ఇంకా అనేకమైన అల్పసంఖ్యాక వర్గాలుంటవి. అవి అనేక కారణాల వలన తమ మనుగడకు భద్రతను కల్పించుకొనే ఏర్పాటులు చేస్తవి. కాబట్టి ఇలాంటి ప్రయత్నాలన్నింటినీ ప్రజాస్వామ్య వ్యవస్థలో గుర్తించాలి. అల్పసంఖ్యాక వర్గానికి భావనాశక్తి హెచ్చుగా వుంటుంది. అంటే భావనాశక్తి యొక్క సత్ఫలితాలన్నింటిని అదొక్కటే అనుభవిస్తుందనిగాదు. ఉదహారణకు ప్రకృతిశాస్త్రాలు, సాంఘిక శాస్త్రాలు అల్పసంఖ్యాక వర్గ మేధావుల అద్భుతసృష్టి. అటుపిమ్మట అవి సమస్త

ప్రజల ఉపయోగానికి అనుకూలం చేయబడినై. అందువలన అభ్యుదయ భావాలు అల్ప సంఖ్యాకులకు చెందినవే అయినా ఉపయోగంలో అవి సమస్త ప్రజలకు అందుబాటులో వుంటవి. ఇలా అల్పసంఖ్యాకవర్గం పరోక్షంగా తన భావాలను లేక తనపరిశోధనలను అధిక సంఖ్యాకులకు పంచిపెట్టి వారి సానుభూతిని పొందుతుంది. ఈ కారణాలవలన అల్పసంఖ్యాక వర్గం అధిక సంఖ్యాక వర్గంలో భావసంచలనం తెచ్చి తనను తాను బలపర్చుకొంటూ పోటీకి తయారవుతూనే వుంటుంది. కాబట్టి ప్రజాస్వామ్యంలో మరొక భాగంగా అల్పసంఖ్యాక వర్గం యొక్క పాత్ర ఒక ప్రత్యేకతను పొందివుంది. ప్రజాస్వామ్యంలో అధిక సంఖ్యాకులు తగ్గిపోయేదానికి అల్ప సంఖ్యాకులు పెంపొందేదానికి ఒక చక్కని అవకాశ మున్నది. అన్ని సిద్ధాంతాలకు వున్న పరిధులు ప్రజాస్వామ్యానికి ఏర్పడనందువలననే అది సజీవమైన నిరంతర సముద్ర తరంగాలవలె కనుపిస్తూ వుంటుంది.

ఇక ప్రజాస్వామ్యంలోని వ్యక్తిగత ధోరణిని పరిశీలిద్దాం.

అటు అధికసంఖ్యాకవర్గం గాని, ఇటు అల్పసంఖ్యాక వర్గంగానీ వ్యక్తుల సమీకరణ వలననే ఏర్పడుతున్నవి. అందువలన ఆ రెండింటిలో వ్యక్తుల పాత్రకు ఒక ప్రత్యేక విశిష్టతవుంది. ఇంతకుముందు మనం చెప్పుకున్న ఆ రెండు వ్యవస్థలలోని మానసిక స్థితులు వాటిలో సమీకరించ

బడిన వ్యక్తుల మానసిక స్థితులే! కాకపోతే కనుపించేది వ్యక్తుల మానసిక స్థితిలోని వైవిధ్యం.

వ్యక్తి ఎప్పుడూ తనను ఇతరులు గౌరవించాలని ఎలా అనుకుంటాడో అలాగే ఇతరులను గౌరవించటం ధ్యేయంగా పెట్టుకోవటం అవసరం. అన్నింటికంటె ముందు అతడిని అతడే గౌరవించుకోవాలి. తనపట్ల తనకున్న వ్యక్తిగత దృక్పథమే తన దినచర్యలోని సమస్త వ్యవహారాలకు ప్రాథమిక సోపానంగా వుంటుంది. అసలు వ్యక్తిగా మానవుడు వుండాలంటే అతనికి ఆత్మ అనేది వుండటం అవసరం. అతడు వ్యక్తిత్వం అందుకోవాలంటే అతని ఆత్మను గౌరవించుకోవటం నేర్చుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఇవి వ్యక్తికి ధర్మాలయితే — వ్యక్తి అధిక సంఖ్యాక బృందంలో వున్నా అల్పసంఖ్యాక బృందంలో వున్నా అతడిపట్ల ప్రజాస్వామ్యం రక్షరేఖగా వుంటుంది, అతడు 'నేను' అనేభావంనుంచి 'మన' అనే భావానికి తన కుటుంబంలోనే మారుతున్నాడు. అందులోని ప్రతిఒక్కడికి హృదయం వున్నది. అక్కడ ఒకరిని పస్తుపెట్టి మరొకరు తినటం అనేది జరుగదు. వ్యక్తి తన సంకుచిత హృదయాన్ని ఇక్కడ విస్తృతం చేస్తూ వున్నాడు. ఈవిషయంసంఘంలోసాధ్యంగాదు. అక్కడున్న అధిక సంఖ్యాకవర్గం, అల్ప సంఖ్యాకవర్గం దేనిలో వున్న వ్యక్తుల్ని దానిలోనే అత్యున్నత జీవితాన్ని, నికృష్టజీవితాన్ని చూస్తూ వుంటాయ్. అందువలననే ప్రజాస్వామ్యంలో వ్యక్తిత్వానికి రాణింపు వున్నది.

ప్రతి మానవుడు ప్రధానంగా ఏమికోరుకొంటాడని ఆలోచిస్తే మనకు మూడు సత్యాలు కనిపిస్తున్నవి. అవే స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరత్వం. ఈ మూడింటిని ఎలా సాధించుకోవటమనే దానిమీద మానవుడెన్నో కలలుకంటూ వున్నాడు. అందువలన ఈ మూడింటితో ప్రజాస్వామ్యాని కున్న సంబంధాన్ని మనమిప్పుడు పరిశీలిద్దాం. ఈ మూడింటి మధ్యగూడ అవినాభావ సంబంధం వున్నదన్న విషయాన్ని గూడ మనం గమనించాలి. ఇందులో ఏఒక్క దాన్ని గురించి చెప్పుకోవాలన్నా మరొకదాని ప్రసక్తి వుంటూనే వుంటుంది. ఈ మూడింటిలో సోదరత్వాన్ని ఉత్తమోత్తమమై నదిగా అనేకమంది పెద్దలు భావించటం జరిగింది. మనంగూడ దీనిని ఆమోదిస్తూ ముందు స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యాన్ని గురించి పరిశీలన చేద్దాం.

ప్రతివ్యక్తీ స్వేచ్ఛను కోరుకొంటాడు. ఆ స్వేచ్ఛను సంపాదించేందుకు వ్యక్తిజరిపే పోరాటం అనేక విధాలుగా వుండవొచ్చు. రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాలలో స్వేచ్ఛను సంపాదించాలనే తాపత్రయమేగాక తనను ఇతరత్రా నిర్బంధంలో వుంచిన అనేక కనపడని విషయాలపై గూడ అతడు తిరుగుబాటుచేస్తూ వుంటాడు. మతం, విధులు, ఆచారాలు, కట్టుబాట్లమీద; సాంప్రదాయాలు చట్టాలపైనా మొత్తంమీద తనస్వేచ్ఛకు భంగకరంగావుండే విషయాలన్ని టిపైనా తిరుగుబాటు వుండవొచ్చు. అలాంటి పరిస్థితులలో కొరగబడటం వ్యక్తికిగాని, జాతికిగాని వుండే నైతికహక్కు.

అనేక వున్నత విషయాలను గురించి మనం ఎంతో జాగ్రత్తగా ఆలోచించే యోచనా పరులమే గాక వాటిని అమలు పెట్టటానికి వీరులంగా కూడ వుండవలసి వుంటుంది. అందువలన ప్రజాస్వామ్య ధోరణిలో స్వేచ్ఛగా వుండటం ఒక మూలసిద్ధాంత భాగమై వున్నది.

మానవులమధ్య మైత్రి అనేఒక సాధనం లేకుండా సంతోషంగా వుండటానికి, బలంగా వుండటానికి, సాధ్యం గాదు. ఒక సమాజంలో కొద్దిమంది స్వేచ్ఛగా వుండేవారు, అనేకమంది స్వేచ్ఛ కోల్పోయినవారు ఉన్నారనుకుందాం; అంటే యజమానులు. బానిసలు వున్నారనుకుందాం. ఇక్కడ బానిస పతనమైపోతే యజమాని తప్పకుండా డవుతున్నాడు. ఇద్దరి బ్రతుకులలోను వ్యత్యాసం స్పష్టమవుతుంది. స్వతంత్రునికి సుఖముండదు. బానిసకు సుఖముండదు. తనకు వందరెట్లుగానున్న జనాభాను గుప్పిటిలో పెట్టుకొనేదానికి అతడెన్నో అవాంఛనీయమైన పనులు చేయవలసివుంది. అందువలన మానవునికి సంపూర్ణత్వం రావాలంటే సిసలైన స్వేచ్ఛాజీవిగా అతడు బ్రతకాలి. ఇక్కడ మళ్ళీ సమానత్వం, సోదరత్వం అన్న అంశాలు వస్తాయి. స్వాతంత్ర్యం కొద్దిమందినుంచి అనేకమందికి విస్తృతం చేయబడింది. ఒకప్పుడు కొద్దిమంది స్వాతంత్ర్యం రక్షించుకోవట ఎలా అన్నది సమస్య అయితే ఇప్పుడు మానవులందరు స్వాతంత్ర్యం అనుభవిస్తూ దానిని రక్షించుకోవటం ఎలా అన్నదే సమస్య. దీని ప్రతిఫలంగా స్వాతంత్ర్యారంగం విస్తృతమై పోయింది. అది యిప్పుడు ఆస్థికివుండే స్వేచ్ఛా పరిధుల్ని

అధిగమించింది. ఇక్కడ మానసిక స్వేచ్ఛను అందులో ఒక టిగా ఉదహరించుకోవలసివుంది. ఇవన్నీ కలసి జీవితంలో భావ స్వాతంత్ర్యానికి, సభాస్వాతంత్ర్యానికి దారితీసినై. ప్రతి ఆధునిక మేధావి తన ఆలోచన కంతరాయ మొచ్చినప్పుడు, తను ఆలోచించినదాన్ని చెప్పాలనుకొంటే అడ్డు వొచ్చినప్పుడు చిందరవందరై అందుకు ఒక చిన్నయుద్ధం చేస్తాడు. అయితే అన్ని సమయాలలో ఇలా వుంటుందని భావించరాదు. ఆలోచిస్తే ఇప్పుడు స్వేచ్ఛ ఎంతటి సున్నితమైన, అపురూప వస్తువుగా మారిందంటే అది విశ్వవ్యాప్తి పొందటమే నిదర్శనం.

ఈ శతాబ్దంలో స్వాతంత్ర్యాన్ని గురించి ఎంత చెప్పకున్నా అది తరిగేదికాదు. స్వాతంత్ర్యం అవిభాజ్యమైనది. ఈ అవిభాజ్యత కేవలం వ్యక్తులవరకే పరిమితంగాక వర్గాలకు, జాతులకు, ప్రాంతాలకుగూడ విస్తరించింది. తుదకిప్పుడది ఐక్యరాజ్యసమితి కార్యాంశాలలో ఒక భాగంగా ప్రకటించబడింది.

వాక్ స్వాతంత్ర్యం అనేది అరికట్టబడితే ఆలోచించటమనేది గూడ సహజంగానే సంకెళ్ళలో పడిపోవలసి వుంటుంది. ఆలోచించటమనేది ఎప్పుడైతే ఆగుతుందో కర్తవ్యానికి దారిదొరకదు. అప్పుడు ప్రకృతి శక్తులకు మానవుడు బానిస అవుతాడు. తిరిగి మహోన్నతాశయాలకోసం అతడెంతో మూల్యం చెల్లించవలసి వుంటుంది. అందువలన జీవిత లక్ష్యాలతో ఆలోచన, లేక ఊహ స్వాభావికమైనదిగా గుర్తించ

బడాలి. అనేకమంది స్వేచ్ఛకు తర్కాన్ని ఆధారంగా తీసికొని వక్రభాష్యం చెపుతుంటారు. స్వేచ్ఛ అంటే వ్యక్తి తన చిత్తం వచ్చినట్లు ఆలోచించటమని, అతడనుకున్నట్లు మాట్లాడటమని, అతడు కావాలనుకొన్నప్పుడు చేయుట మనేదే ఆ భాష్య స్వభావము. స్వేచ్ఛకిది నిదర్శనంగా భావిస్తే ఇంతకంటె ఆత్మద్రోహం మరొకటి వుండబోదు. ఒకడు మధుపానం చేస్తాడనుకుందాం. దానిని అతని భార్యా బిడ్డలు గూడ చేయాలని అతడి అభిప్రాయమైతే తప్పవుతుందో లేదో ఆలోచించండి. అందువలన వ్యక్తి వూహించినట్లుగానే జరగట మనేది అన్నింట సాధ్యంగాదు. సోదరత్వాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు స్వేచ్ఛకు కొన్ని పరిమితులు విధించుకో వలసి వుంటుంది.

ఎక్కడైతే తప్పులు తడకగా విధానాలు రుద్దబడుతుంటవో, పైపెచ్చు అవి తప్పనిసరి అని చెప్పబడుతుంటవో అప్పుడు ప్రతిఘటన ఒక నైతిక తత్వమయి కూర్చుంటుంది. సాంఘికంగా వ్యక్తి ప్రాధాన్యతను మనం గమనిస్తున్నాం. అంతమాత్రాన్నే వీరారాధనను, స్వార్థారాధనను మనం ఆమోదిస్తున్నామనిగాదు. సామాజిక స్వేచ్ఛను విషపూరితం చేసే వ్యక్తి స్వేచ్ఛ గర్హించబడాలి. ఒక్క మాటలో చెప్పవలసివస్తే సాంఘిక సంక్షేమాన్ని చెడగొట్టే వ్యక్తి యొక్క వ్యక్తిత్వం ఎంతటిదయినా ఆమోదించే దానికి విలువ లేదు

మన మింతకు ముందు ప్రజాస్వామ్యం వ్యక్తియొక్క మానసిక లక్షణంగా చెప్పుకున్నాము. వ్యక్తుల సమీకరణ

సంఘమైనప్పుడు వ్యక్తుల మానసిక లక్షణాలుగూడ అందులో సమీకరణమై ఉన్నవి. వ్యక్తులనే పూసలు సంఘమనేమాలలో సాంప్రదాయ బద్ధులవుతారు. కాలానుగతంలో బృహత్తర సాంఘిక తత్వాన్ని తిరిగి సాంప్రదాయం ఓడిస్తుంది. అంటే సోదరత్వాన్ని ఓడిస్తుంది. వివిధరంగాలలో వివిధ స్థాయిలలో మానవులు సోదరులుగా మెలుగుతూవుంటే ఎప్పుడూ సాంఘిక భద్రత కనుపిస్తూ వుంటుంది. అటుపిమ్మట స్వేచ్ఛతో దానిని సుస్థిరం చేసుకోవటం సులభం. ఒకరి అభిప్రాయాలతో మరొకరు భేదించటాన్ని, ఒకరి అలవాట్లతో మరొకరు భేదించటాన్ని లేక ఏకీభవించటాన్ని, ప్రేమించటాన్ని సోదరత్వాన్ని బలపర్చే విషయంగానే గాక స్వేచ్ఛను గూడ పెంపొందించేదిగా భావించ వలసివుంటుంది.

ప్రతి మానవుని యొక్క స్వాతంత్ర్యం ఎదుటి వ్యక్తి యొక్క స్వాతంత్ర్యం ఎక్కడ ప్రారంభమవుతుంతో అక్కడి వరకు విస్తృతమవుతూ వుంటుంది. స్వాతంత్ర్యం ఎంతమంచిదైనా దానికి హద్దుండాలనే అంశాన్ని మనం సమర్థించాలి. ఒకరి స్వాతంత్రం యితర మానవుల స్వేచ్ఛకు భంగము వాటిల్లని రీతిలో, సమాన హక్కును కుదించని రీతిలో వున్నప్పుడే ఇది సమర్థనీయ మవుతుంది. సోదరత్వం కావాలంటే స్వేచ్ఛ వుండాలి. అదే మాదిరి సమానత్వ మొక్కటే సామాన్య మానవుని స్వేచ్ఛకు గీటురాయి. మానవులలో ఉద్రేక మనేది ఒక ప్రాథమికస్థాయి. దీని నుంచే సమస్త మానవ విలువలు బయలుదేరుతున్నై. వీటిని అతిక్రమించినప్పుడే మానవ అరిష్టాలు ముంచుకొస్తున్నవి.

మనం యింతకుముందు స్వాతంత్ర్యానికీ ప్రజాస్వా
మ్యానికి వున్న సంబంధాన్ని పరిశీలించాం. ఇప్పుడు సమాన
త్వానికీ ప్రజాస్వామ్యానికి వున్న సంబంధాన్ని పరిశీలించ
ప్రయత్నిద్దాం. స్వాతంత్ర్యంలేనిదే సమానత్వంరాదు. ఒక
జాతికి లేక ఒకదేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం వచ్చిం
దనుకుందాం. కాని ఆర్థికంగా స్వాతంత్ర్యం రాకపోతే ఆ
ఆర్థికస్వాతంత్ర్యం, రాజకీయ స్వాతంత్రం మాదిరి ఏకొద్దిమంది
చేతుల్లోనేవుంటే, దానిని ప్రజాస్వామ్యతత్త్వంగా చెప్పకో
లేరు. అందువలన ప్రజలందరకూ సంబంధించిన సమానత్వం
ఆర్థికంగానేగాక తదితరంకూడా ఎలా రావడమన్నది ప్రశ్న.
ప్రపంచంలో అన్నిరంగాల్లో మానవులమధ్య అంతులేని
వ్యత్యాసమున్నది. ఈ వ్యత్యాసాన్ని తొలగించి సమాన
త్వాన్ని సాధించటానికి సావకాశం వుందా లేదా అన్నప్పుడు
కొందరది అసాధ్యమనీ, కొందరది సాధ్యమనీ, అంటూ
వుంటారు. మనమిప్పుడు సమానత్వాన్ని ఒక ఆశయంగా
తీసుకొని ప్రజాస్వామ్యానికి జోడించి చూడవలసివుంది.

పుట్టుకలో మానవులందరూ సమానమే అయినప్పటికీ,
నిర్మిత సాంఘిక వ్యవస్థలో ఆ సమానత్వం కనబడుతుందా ?
ఇక్కడ మనం ప్రజాస్వామ్యాన్ని జొప్పించటానికి మానవులు
సమానులు కాదనిగాని, వారు సమానం చేయబడవలసినపని
లేదనిగాని, చెప్పవలసిన అవసరంలేదు. ఒక వైపున సాంఘిక
శాస్త్రకారులు సమానత్వాన్ని ప్రతిపాదిస్తూ వుంటే
మరొకవైపున మానసిక శాస్త్రకారులు మనషి మనిషికీ
మనస్తత్వంలో వుండే ఆ సమత్వాన్ని నిరూపిస్తుంటారు.

ప్రాణంలేని ఒక యంత్రపుమూసలో తయారయ్యే వస్తువుకు నిర్మాత సమాన స్వరూపాన్ని తీసుకరావచ్చుగాని, ప్రాణం గలిగిన, పెరిగే మానవులకు ఈ పరిస్థితుల్లో సమానత్వం లేవటం ఎలాగనే సమస్య వుండనేవుంటుంది. ప్రజాస్వామిక ప్రతిపాదన పితామహులు దీనిమీద మనసుపెట్టి ఆలోచించినట్లు కనిపించినా, వారు మానవులందరూ సమానమేనని ప్రకటించినా, లేక ఆ ఆశయాన్ని చట్టబద్ధంచేసినా, ఆచరణలో ఆ స్థితి ఏమౌతుందా అని ఆలోచించాలి. మానవులందరూ సమానంగా సృష్టించబడ్డారని వారంటే, కాదు వారు పరిణామంలో పతిమార్పుచెంది పెరుగుతున్నారని మరొకరంటున్నారు. మరొకరకంగా పుట్టుకలోనే మానవులు సమానులని వారంటున్నా, పుట్టుకంటే ఏమిటో జీవశాస్త్రానుగుణ్యంగా, అందుకు భిన్నమైన నిర్వచనం చెబుతున్నారు మరొకరు. అందువలన ప్రజాస్వామ్యవాదులకు యిలాంటి విషయాలపై యిదమిద్ధంగా తేల్చటానికి వీలుకలగటంలేదు. ఒక వైపున జఫర్సన్, ప్రాంక్లిన్‌లాంటి రాజకీయవేత్తలు, వారి వెంబడే ఫ్రాన్సు రాజకీయవేత్తలు రాజరికాన్ని త్రోసిరాజని ప్రజాస్వామ్యాన్ని చేబడితే, మరోవైపున రాజరికాన్ని శిరసావహిస్తూనే, ప్రజాస్వామ్యాన్ని చేబట్టినయ్ మరికొన్ని దేశాలు. రెండుచోట్లకూడా విధానాలు అనుసరిస్తున్నది ప్రజలే. కనుక విశ్వవ్యాప్త ప్రజాస్వామ్యంలో వైవిధ్యం వున్నప్పుడు ప్రజాస్వామ్య ఆశయంలోనూ వైవిధ్యం వుంది.

అందువలన సమానత్వాన్ని కొన్ని పరిదుల్లోపల్నే మనం గ్రహించవలసి వుంటుంది.

ఆది భౌతికరీత్యా మనం ఆలోచనచేస్తే, మానవులు అసమానులేనని తేల్తుంది. ఇది వారి ప్రవర్తననుబట్టి రుజువౌతున్న విషయం. జాతి, మత, రంగురీత్యా ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పవచ్చు ననటం ఎంతసులభమో అంత కష్టం కూడా. ఎంతో మానవ మేధస్సు ఈ ప్రయత్నంలో వెచ్చించబడవలసివుంది. వాస్తవంగా మానవుల మధ్యవున్న అసమత్వాలను కనిపెట్టటం అంత సులభంకాదు గాని, కనిపెట్టగలగటం అదృష్టంగా భావించాలి. ప్రతి మానవుడు వున్నపళంగా తాను పెంపొందటానికి, వికసించటానికి సుఖించటానికి ఆ ప్రయత్నం దోహదంగావాలి. వాస్తవానికి జాతి మత, రంగు విచక్షణలేకుండా మానవులమధ్య సమాన అవకాశాలు కల్పించబడితే అదొక గొప్ప ప్రజాస్వామ్య లక్ష్యసాధనే ఔతుంది! ఇదిఒకదారి. దీనిని దారిగా మనం కనిపెట్టినప్పుడు, దీని గమ్యం ఎక్కడ వుంటుందో చూడకుండానే చెప్పలేం. అందువలన పరిశోధన విస్తృతంగా సాగాలి.

రాజకీయ న్యాయచట్టాలతో లభించిన సమానత్వం, తదితర రంగాలలోనూ వుండాలని చెప్పవచ్చుగాని, అది కేవలం మంచి ప్రారంభంగానే ఉంటుంది. సాధారణంగా చెప్పుకోవాలంటే ఒకవ్యక్తి అనుభూతిలో మంచినైన సమానత్వాలే మరొక వ్యక్తిపట్ల గూడా అన్వయించాలి. మంచి అన్నప్పుడు కొన్ని విషయాలు ప్లేటోనుండి యిప్పటివరకు ప్రశ్నించబడనటువంటివి అనుకోవచ్చు. కాని నేటి సాంఘిక

శాస్త్రజ్ఞునితో అవి పోల్చి చెబితే, కొందరు తామనుభవిస్తుం దేదో చూస్తే అందరికోసం అని చెప్పడం అదే మొత్తంమీద సౌభాగ్య ప్రపంచాన్ని రూపొందించగలరనే అభిప్రాయం కలుగుతుంది.

పై అభిప్రాయ మెందుకంత పవిత్రమయినదంటే, పేదలు, అజ్ఞానులకన్నా, భాగ్యవంతులు, సంస్కృతీపరులు దాన్ని గమనించి ఆచరించగలగటం వలననే. కాని సమానత్వ మనేది అనుభవించే శక్తిపైనే ఆధారపడి, పూర్వాపరాలు గుర్తించకపోతే మంచిదికాదు. స్వయం అభివృద్ధి అందుకు దోహదకారి. దాన్నిబట్టి మానవుడు అభివృద్ధిఅయ్యే జంతువనీ, అతని శక్తుల నంతములని తెలుస్తున్నది.

ఇలా వుండగా ఆదాయం, సంపద ప్రశ్న మరొకటి వున్నది. ఆదాయాన్ని సమానంగా పంచాలనే దానికన్నా సంపద విషయం ప్రధానం. నేటి అవసరాలకు సరిపడే ఉత్పత్తి సంపదను పంచటంవలన వస్తుందా అనే దానిలో చాలా అర్థంవుంది. అంటే అక్కడే ఆగమంటున్నామని అర్థంగాదు. సంపద అనగానే అధికారం ధ్వనిస్తుంది. అదిలోపిస్తే ఆదాయం భద్రతారహిత మౌతుంది. ఈ దృష్టితో కాకపోయినట్లయితే నిపుణత పేరుతో సమానత్వం ప్రోత్సహించ బడేదే. పోటీ వ్యవస్థ నుండి యాజమాన్యం తీసివేయబడితే, ఉత్పత్తిలోనే గాని, పుంజుకోనటంలో పోటీ లేదనవచ్చు. ఈ సూత్రాన్ని యుద్ధ సమయంలో 'డాలర్ మనుషులు' ప్రచారం చేయగా, విజ్ఞానులు విస్తృత పరచారు.

కాని నేడు చాలామందిలో డబ్బును కలిగివుండటం గాక, తయారు చెయ్యడ మనేది ప్రధానంగా వున్నది. పుంజుకునే వర్గంలో, సృజనశక్తి తక్కువైంది. చదువు, చట్టాలతో సంపదను విస్తృతంగా పంపిణీ చెయ్యవచ్చు. అలా చెయ్యటంలో 'వత్తిడి' వున్నా ఆందోళన చెందవలసిన అగత్యం లేదు. కాగా స్వామ్యం వుండే అవకాశాల్ని దృష్టిలో పెట్టుకోవాలి.

ప్రజాస్వామిక జీవితంలో సౌభ్రాతృత్వం ఉన్నత బాహ్యావసరము. దానికి స్వేచ్ఛ తప్పనిసరిగా వుండాలి. స్వేచ్ఛ కొందరికే మంచిదైతే. అందరికి మంచిదే, ఇలాగ స్వేచ్ఛద్వారా సౌభ్రాతృత్వం ఔన్నత్యానికి తేబడింది. స్వేచ్ఛ అనేది సమానత్వంద్వారా సాధారణీకరించబడింది. ప్రజాస్వామ్య మనేది అందరు వ్యక్తులకు సంబంధించినది - అంటే వారి మనస్తత్వం సమానత్వం గురించిన దైనదన్న మాట.

రాజకీయంగానూ. సాంఘికంగానూ, ఆర్థికంగానూ, సమానత్వాన్ని సాధించటానికి, అధిక సంఖ్యాకులు, అల్ప సంఖ్యాకులు అనే పేరుతో, దౌర్జన్యం, బలవంతమైన మార్గాన గాకుండా, శాంతియుతమైన పంథా ఒకటి మానవ జీవిత విలువరీత్యా అవసరమై వున్నది. ఏ దేశంలోనైనా యిప్పటి సాంఘిక వ్యవస్థలో అధిక సంఖ్యాకులుగా నున్న ప్రజల ఆర్థిక వ్యవస్థను గూడా పరిశీలించాలి. ఇప్పుడు ప్రధానంగా సమానత్వం అనేది ఆర్థిక రంగాన్ని దృష్టిలో

పెట్టుకునే అనేకమంది మాటలాడు తున్నారు. ఆర్థిక సమానత్వం సాధించటానికి ప్రజాస్వామ్యాన్నే ధ్యేయంగా తీసుకోవలసి వున్నది. ఎందుకంటే ప్రజాస్వామ్య పాత్ర యితర రంగాల్లో కూడా బలీయంగా వున్నది. కాబట్టి అందువలన మనకు స్పష్టంగా అర్థమయ్యే విషయమేమంటే మానవుల మధ్య అన్ని రంగాల్లోనూ సమానత్వం సాధించబడటానికి పక్షపాతం వుండనవసరంలేదు. అంటే వారార్థాయిని చేరుకోటానికి సమానావకాశాలు కల్పించబడాలి.

ఒక బావిలో పడిన వ్యక్తి బైటికి రావాలంటే మరొక వ్యక్తిని బావిలోకి త్రోయవలసిన పనిలేదు. అందరూ కలసి ఒక పతితుని ఉద్ధరించే దానికి ప్రయత్నం చేయాలిగాని, ఒక పతితునికోసరం యిప్పటి వ్యవస్థలోని ప్రజలందరూ పతితులై అటు పిమ్మట అందరూ సమానంగా పెరగాలనటం, అవివేక మనిపించుకుంటుంది. స్వాతంత్రం అందరిదైనప్పుడు, దాని అవిభాజ్యమైన సమానత్వం కూడా అందరిది. అందు వలన అవి రెండూ కూడా ప్రజాస్వామ్యయుతమైనవి. ఇక ఈ రెండింటినుంచీ విడదీయటానికి వీలులేని సోదరత్వాన్ని గూర్చి మనం కొంత పరిశీలించాలి. (రెండవభాగం చూడండి)